# అతడు



renigunta

సెంట్రల్ జైలు !

చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్ధం రాజ్యమేలుతోంది !!

రాత్రి పన్నెండు గంటలు కావస్తున్న సూచనగాజైల్లో గంటలు మ్రోగాయి !! ప్రఘాఢమైన నిద్రలో మునిగివునాన్న ఖైదీలందరూ ఆ చప్పుడికి మేలుకుని, క్షణంలో తిరిగి నిద్రలోకి జారుకున్నారు...**అతను** తప్ప!!

అతను లేచి, గోడకానుకుని కూర్చున్నాడు.

మిగతా ఖైదీలతపాటు అతన్ని వుంచక ప్రత్యేకమైన సెల్లో వుంచడం వల్ల ఒంటరి తనం భరించలేకుండా వున్నాడు . అతను లేచి అసహనంగా పచార్లుచేయసాగాడు.

మరో నాలుగు గంటలే తను బ్రతికి వుండటం. ఆ తర్వాత తనని ఉరి తీస్తారు. మరణం కోసం ఎదురుచూడటం ఎంత దుర్భరం! అతనికి త్వరగా తనను ఉరితీస్తే బాగుండుననిపించేలా వుంది.

గతం మగిల్చిన గాయాలు సినిమా రీళ్ళలా అతని మస్తిష్కంలో తిరగసాగాయి.

****

తలుపు దగ్గర అలికిడైంది.

ల్యాప్‌టాప్‌లో వచ్చిన ఈ-మెయిల్స్ చదువుతున్న అతనికి తలుపు తెరుచుకుంటూ వస్తున్న మల్లీశ్వరి కనిపించింది.

" ఏంటీ... అయ్యగారు బాగా బిజీగా వున్నారు ? " చిరునవ్వుతో లోపలికొస్తూ అడింగింది మల్లీశ్వరి. ఆమె చేతిలోని పళ్ళెంలో పిండివంటలున్నాయి. పళ్లేన్ని బల్లమీదుంచి అతని వంక చూస్తూ చెప్పింది..."అమ్మ తమరికోసం పంపింది. ఆరగించండి." క్షణం పాటు అతను ఆమె గంభీరంగా చూస్తూండిపోయాడు. మల్లీశ్వరి అతని కళ్ళముందు చిటికెలేస్తూ అడిగింది.

" హలో ! మాష్టారూ... ఏలోకంలో విహరిస్తున్నారు? "

మరుక్షణం స్పృహలోకొచ్చిన అతను తనలోని భయాన్ని ఆమెకు కనిపించకుండా అన్నాడు... "అబ్బే ఏంలేదు!ఏంటి సంగతి ?.. కొత్త పరికిణి..కొత్త..." అతని మాటల్ని కట్‌చేస్తూ బుంగ మూతితో అందామె.. " అంటే...నీకు గుర్తులేదన్నమాట.."!

అతను చిరునవ్వుతో ఆమెను దగ్గరకు తీసుకుంటూ అన్నాడు "ఊ...హూ..."

ఆమె అతన్నుండి దూరంగా జరిగి విసురుగా అంది. "అలాగైతే నే వెళ్తాను. ఇక నీ ముఖం చూపించకు" ఆమె వెనక్కు తిరిగి వెళ్ళిపోతుండగా మృదువుగా ఓ కవిత అతని నోటినుండి వెలువడింది.

"నీ ప్రేమలో వివశుణై.. నన్ను నేను మరవనీ..
కలకాలం నీ హృదయంలో కావ్యమై నిలవనీ...

renigunta.blogspot.com

కలలా కరిగిపోయే ఈ చిన్ని జీవితంలో

ప్రియతమా.. ! నన్ను నేను కోల్పోనీ...."

చరచరా వెళ్ళిపోయేదల్లా చటుక్కున ఆగి వెనక్కి తిరిగి చూచినామెకు చేతిలో పొద వాటి కాడతే వున్న ఓ ఎర్రగులాబీ కనిపించింది. చిలిపిగా నవ్వుతూ నిల్చున్న అతని దగ్గరకు ఆమె అప్రయత్నంగా అడుగులేస్తుండగా అతను తన ప్యాంటు జేబులోంచి రిమోట్ని తీసుకుని నొక్కాడు. మరుక్షణం ఆమె పై పూలవర్షం కురిసింది. "పుట్టినరోజు శుభాకాంక్షలు" అన్నాడతను.

ఆమె పరిగెత్తుకుంటూ వచ్చి పరవశంగా అతని గుండెలమీద వాలిపోయింది.

ఆ క్షణంలో ఆమెకు తెలియదు మృత్యువు తమను వెంటాడబోతోందని !!!

****

అతను దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. క్షణం క్రితం అతనువెలిగించుకున్న సిగరెట్ అతని గుండెలాగే మండుతోంది. తను ఈ ఊరికి వచ్చినప్పుడు ఒకటే లక్ష్యం. అది.. తనకు అప్పగించిన పనిని విజయవంతంగా పూర్తిచేయాలి. ఆపనిలో తన ప్రాణాలు పోయినా సరే, ఆ లక్ష్యం మాత్రం గురి తప్పకూడదు. ఒకవేళ, తను పోలీసులకు పట్టుబడితే మెడలో హార్ట్ ఆకారంలో వుండే సైనైడ్ మాత్రను మింగేయాలి తప్ప, ఎటువంటి పరిస్థితుల్లోనూ తమవ్యూహ్యం గురించి పోలీసులకు చెప్పకూడదు. ఇది తన కమాండర్ యిచ్చిన ఆర్డర్. ఒకవేళ మనసు మారి తను ఆ పని చేయకపోతే తనని తన గ్రూప్‌వాళ్ళే నిర్ధాక్షిణ్యంగా చంపేస్తారు. చావు గురించి తనెప్పుడూ భయపడలేదు.

తన బాధంతా మల్లీశ్వరి గురించే !

వాళ్ళు ఆమెని కూడా చంపేస్తారనే తన దిగులంతా ! ఒక్కసారి ఈ రొంపిలోకి దిగాక, బంధాలు, అనుబంధాలు, చుట్టరికాలు, ప్రేమ, మానవత్వం లాంటి వాటికి తావుండకూడదని మొదటి నిబంధన ! ఐతే... తాను దాన్ని అతిక్రమించేసాడు. గుల్‌ఫాం ఫజల్ వస్తున్నట్టు తనకు ఈరోజే వర్తమానం అందింది. వాడు నరరూప రాక్షసుడు. తన ప్రేమ విషయం వాడికి తెలిసిందంటే మొదట ఆ అమ్మాయిని చంపేస్తాడు. తను ఈ విషయం మల్లీశ్వరికి చెప్పలేదు. అలాగని చెప్పకపోతే, ఆ అమ్మాయి బలిపశువైపోవచ్చు.

ఇప్పుడెలా ఆ ఆ అమ్మాయిని రక్షించాలో తనకి అర్థంకావడం లేదు.

తనది ఓ చిన్న గ్రామంలోని పెద్దకుటుంబం. ఆ ఊళ్ళో వున్న నాలుగైదు ముస్లిం కుటుంబాలలో తనదీ ఒకటి. తను కుటుంబంలో ఐదవ సంతానం. నలుగురు ఆడపిల్లల తర్వాత పుట్టిన తనంటే కుటుంబంలో అందరికీ గారాబమే ! ఆ కుటుంబంలో మొదటిసారిగా స్కూల్ ముఖం చూచింది కూడా తనే. తండ్రి బాబాసాహెబ్ టైలర్. ఆయన కొంతకాలం

renigunta-uttam.blogspot.com

బొంబాయిలో వుండిరావడంతో ఆ ఊళ్ళో అతన్నందరూ బాంబే టైలర్ అని పిలిచేవారు. ఆయన బొటాబొటి సంపాదనతో తల్లి జైబున్నిసా బేగం గుట్టుగా కాపురాన్ని నెట్టుకొచ్చేది. పిల్లల వయసు పెరిగేకొద్దీ ఆర్థిక అవసరాలూ పెరిగాయి. దాంతో కుటుంబం ఆర్థికంగా బాగా చితికిపోయింది. సరిగ్గా ఆసమయంలోనే బొంబాయిలో వుండే తమ దూరపు చుట్టం సనోబరున్నిసా వాళ్ళ పెద్దకూతురికి కువాయిట్ సంబంధం తీసుకుని వచ్చింది. పైసా ఖర్చు లేకుండా పెళ్ళి జరిపిస్తానని అరచేతిలో స్వర్గాన్ని చూపించి అరబ్ షేక్ తో పెళ్ళి జరిపించేసింది. కానీ, మూడునెలలు తిరక్కుండానే మొదటి అమ్మాయి అరబ్ షేక్ తలాక్ యిచ్చేసాడని
కువాయిట్ నుండి ఇంటికి తిరిగొచ్చేసింది. దాంతో మిగతా ముగ్గురమ్మాయిల పెళ్ళిళ్ళు ప్రశ్నార్థకమైంది.

ఆ దిగులుతో మంచం పట్టిన తండ్రి మరిక లేవలేదు. దాంతో తన కుటుంబం వీధుల పాలయితే, చుట్టుపక్కల వాళ్ళైన మూర్తిగారి కుటుంబం,సంజీవరాయప్ప గారి కుటుంబం సహాయం చేసి ఆదుకున్నాయి. తల్లి, అక్కలు టైలరింగ్ చేసి అప్పడాలు, సేమియాలు తయారుచేసి బజారులో అమ్మి ఎంతో కొంత సంపాదించేవారు.

అప్పటికే తనకి పదకుండేళ్ళు నిండటంతో చదువుకు స్వస్తి పలికి ఏదో ఓ పనిచేసి కుటుంబానికి బాసటగా నిలవాలని నిశ్చయించుకున్నాడు. దగ్గర్లోని టౌనుకెళ్ళి అక్కడ అన్వర్ భాయ్ అనే ఓ మెకానిక్ దగ్గర పనికి కుదిరి త్వరగా పని లోని మెళకువలు నేర్చుకుని యజమాని మెప్పు సంపాదించాడు. అతను తనలోని చురుకుదనానికి, మెచ్చుకుని కొద్ది,కొద్దిగా జీతం పెంచి సహాయం చేసేవాడు.

అన్వర్భాయ్ ప్రతిరోజూ ఐదుసార్లు నమాజ్ చేయకపోయినా, శుక్రవారం రోజున తప్పకుండా నమాజ్ కెళ్ళేవాడు. అలాగే అతని వెంట తనని కూడా తోడు తీసుకెళ్ళేవాడు. ఆరోజు శుక్రవారం కావడంతో నమాజ్ కెళ్ళాక, ఉత్తర భారతదేశం నుండి కొంతమంది వక్తలు వచ్చారని, నమాజ్ తర్వాత వాళ్ళ ప్రసంగం వుంటుందని, తర్వాత కొన్ని పేద కుటుంబాలకు ఆర్థిక
సహాయం చేయాలని వాళ్ళు నిర్ణయించారని,అలాంటివారి వివరాల్ని యివ్వమని అడిగినప్పుడు అన్వర్భాయ్ తన శిష్యుని పేరును యిచ్చాడు.

అన్నట్లుగానే వక్తలు తమ ప్రసంగాలు ముగిసాక, ఓ పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసారు. ఆ తర్వాత ఆర్థిక సహాయం పొందిన వాళ్ళందరికీ గల్ఫ్లో ఉద్యోగాలు యిప్పిస్తామని, ఎవరైనా వెళ్ళే పక్షంలో తాము పైసా ఖర్చులేకుండా పంపిస్తానని చెప్పారు. ఇదేదో మంచి అవకాశంగా వుందని తలచిన తాను, వెళతానని ముందుకొచ్చి తన కుటుంబ వివరాలు వాళ్ళకిచ్చాడు.

ఆక్షణంలో తనకి తెలియదు తను ఓ ఊబిలోకి కూరుకుపోతున్నాడని!

అన్నట్లుగానే కొన్నాళ్ళకు తనకి గల్ఫ్‌లో ఉద్యోగం కుదిరిందని వెంటనే బొంబాయికి రావలసిందిగా ఉత్తరంతో పాటు టికెట్ కూడా రావడంతో తను ఎంతో ఆనందించాడు. ఐత

త

తన తల్లికి, అన్వర్‌భాయ్‌కి తను వెళ్ళటం యిష్టంలేక, సంపాదన తక్కువైనా సరే, యిక్కడే వుండి, నెమ్మదిగా, ఆర్థికంగా పుంజుకోవచ్చని సలహాయిచ్చారు. కానీ, త్వరగా పైకెదగాలనే తనలోని ఆశ, వాళ్ళకు నిరాశను మిగిల్చింది.

అంతే!!

తను బొంబాయికి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత తనేమయింది ఎవరికీ తెలియదు, తనకి తప్ప !!!

****

తను ఇల్లు వదలి వెళ్ళాక ఏమయిందో కుటుంబానికి తెలిస్తే, తల్లి గుండె పగిలి చస్తుందని,అక్కలకు రక్షణ వుండదని తలచి తన ఉనికిని వాళ్ళకు తెలియజేయలేదు. గల్ఫ్ లో ఉద్యోగం యిప్పిస్తానన్న వాళ్ళు దేశం నలుమూలల నుండి తనలాంటి అమాయకపు కుర్రవాళ్ళని పదిమందిని ముందుగా కువాయిట్‌కి తీసుకెళ్ళారు. అక్కడి నుండి ఆఫ్ఘనిస్తాన్ గుండా పాకిస్తాన్ తీసుకెళ్ళి,చివరికి పాక్ ఆక్యుపైడ్ కాశ్మీర్‌లోని టెర్రరిస్ట్ క్యాంప్‌లో పడేసారు

ఏం జరుగుతోందో తెలుసుకునే లోపునే అంతా చేయిదాటిపోయింది. తమవాళ్ళను కాంటాక్ట్‌చేసే ప్రయత్నం చేస్తే, ఎప్పుడూ అలెర్ట్‌గా వుండే ఇండియన్ ఆర్మీ ఇంటెలిజెన్స్ గుర్తుపట్టి, అభం,శుభం తెలియని వాళ్ళ కుటుంబసభ్యుల్ని అరెస్ట్‌చేసి, చిత్రహింసలు పెట్టి చంపేస్తుందని భయపెట్టేవాడు వాళ్ళ కమేండర్ గుల్‌ఫాం ఫజల్. ఆతర్వాత టెర్రరిస్ట్ ట్రైనింగ్ మొదలెట్టారు. ఇష్టంలేని ఇద్దరు కుర్రాళ్ళు తిరగబడితే ఓ రాత్రంతా అడవిలోని చెట్లకు కట్టేసి వెళ్ళిపోయారు. మర్నాడు ఊళ్ళో వాళ్ళ బంధువుల్లో ఎవర్నో ఒకరిని హతమార్చి, ఆ వీడియో చూపించారు. తమ మాటవినకపోతే, ఒక్కొక్కరిగా అందర్నీ చంపేస్తామని భయపెట్టారు. ప్రతిరోజూ ఐ.యస్.ఐ.కి చెందిన ఓ సైక్రియాసిస్ట్ క్లాసెస్ తీసుకుని బ్రెయిన్‌వాష్ చేసే ప్రయత్నం చేసేవాడు. దాంతో తమ యిష్టాయిష్టాలతో నిమిత్తం లేక యంత్రాల్లా మారిపోయారందరు. రివాల్వర్ నుండి రాకెట్‌లాంచింగ్ బాంబర్ వరకు, ఏ.కే.47 నుండి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ల వరకు ఎలా ఉపయోగించాలో, వాటిని విడిభాగాలుగా చేసి తిరిగీ ఎలా ఎసెంబుల్ చేయాలో, రక,రకాల గెరిల్లా యుద్ధ పద్ధతుల్ని, లాంగ్వేజ్ కోడింగ్, డీ కోడింగ్, నేర్పించారు. ప్రతి ఒక్కడూ ఓ ఆరితేరిన ఓ కమెండోలా, అవసరమైతే ఓ మానవబాంబులా మారి భారత్ లో విధ్వంసాన్ని సృష్టించడమెలాగో నేర్పించారు.

ట్రైనింగ్ పూర్తయ్యాక, ఎవరెవరు ఏంచేయాలో నిర్ణయించి, ముందే నిర్దేసించిన చోట

renigunta.blogspot.com

పోస్టింగ్ యిచ్చారు.  ఒక్కసారి భారత్‌లోకి అడుగు పెట్టాక టెర్రరిస్ట్ గ్రూప్‌కి ఎదురుతిరిగితే ఇండియన్ ఇంటెలిజెన్స్‌కి తమ వివరాల్ని లీక్ చేసి వాళ్ళచేతే చంపిస్తామని వార్నింగ్ యిచ్చి వారిని గుప్పెట్లో వుంచుకున్నారు.  తనకు తిరుపతిలో ఓ మోటర్‌సైకిల్ కంపెనీలో మేనేజర్
 గా ఉద్యోగం వేయించి, అవసరమైనప్పుడు వాళ్ళ ఆదేశాలని నిఖ్ఖచ్చిగా పాటించాలని వార్ని
ంగ్ యిచ్చి పంపేసారు.  ప్రతిరోజూ తమకు కోడ్‌లాంగ్వేజ్‌ల ఈ-మెయిల్ ద్వారా ఏంచేయా
లో
పురమాయించేవారు. ఒక్కోసారి నెలల తరబడి ఎటువంటి మెసేజ్ వచ్చేవికావు.

తను ఉండటానికి తిరుపతికి దగ్గర్లో జనసామర్థ్యం తక్కువగా వుండే మంగళం అనే ఏరియాలో ఇల్లు అద్దెకుతీసుకుని మారుపేరుతో గత రెండేళ్ళుగా వుంటున్నాడు. ఈ రెండేళ్ళ కాలంలో ఇంటి ఓనర్ అమ్మాయి మల్లీశ్వరి తనని ప్రేమలో పడేసింది.  మొదట్లో ఎంతో నిగ్రహంగా వున్నా, ప్రేమాభిమానాలకు, ఆత్మీయతకు ముఖం వాచిపోయి వున్న తను ఆమె కుటుంబం చూపించిన ఆప్యాయతానురాగాలకు లొంగిపోయాడు.

అదే తను చేసిన తప్పుని గ్రహించేసరికి ఆలస్యమైపోయింది.

మల్లీశ్వరి తనని గాఢంగా ప్రేమిస్తోంది.  తమ పెళ్ళికి వాళ్ళ తల్లితండ్రులు కూడా ఒప్పుకున్నారు. నిజం తెలిస్తే వాళ్ళు జీర్ణించుకోలేరు.  మల్లీశ్వరి తనని క్షమించదు.

అతని వేళ్ళ మధ్య సిగరెట్ చివరిదాకా కాలి వేళ్లకు వేడిచురక అంటడంతో చటుక్కు
న దాన్ని వదలి ఆలోచనల్లోంచి బయటపడ్డాడు.

సరిగ్గా అప్పుడు తలుపు దగ్గర అలికిడైంది.  గుల్ఫాం ఫజల్ వచ్చాడనుకుని అలెర్ట్
గా నుంచున్న అతనికి తలుపుతెరుచుకుంటూ వస్తున్న మల్లీశ్వరి కనిపించింది. ముఖంలోని ఆందోళనను ఆమెకు కనబడకుండా జాగ్రత్త పడ్డాడతను.

“సిగరెట్లు తాగడం ఎప్పుడు మానేస్తావు? అబ్బా ! వాసన” దగ్గరకొస్తూ అంది.

“పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతో కానీ పోదట” సరదాగా అన్నాడతను.

“అంటే తమరు పుట్టినప్పుడు చేతిలో సిగరెట్ వుంచుకునే పుట్టారన్నమాట !” అతని మెడ చుట్టూ చేతులేస్తూ అంది.

“అవును.. భవిష్యత్తులో అగ్గిపుల్లలాంటి అమ్మాయితో ప్రేమలో పడతానని” ఆమెని దగ్గరకు తీసుకుంటూ అన్నాడతను.  అతనికి దూరంగా జరుగుతూ అందామె

“ఐతే దూరంగా వుండు. దగ్గరకొచ్చావంటే దగ్ధమైపోతావ్ !”

“దహించుకుపోతున్న వాణ్ణి యింకెలా దగ్ధం చేస్తావ్ ?” స్వగతంలో అనుకుని, ముఖానికి చిరునవ్వు పులుముకుని కవితలా అన్నాకడతను....

“ప్రియతమా ! నీ ప్రేమ నన్ను దగ్ధం చేసినా...

reniguntautam.blogspot.com

నీ హృదయ స్పందనలో నేను దాగుంటాను..!

నీ ఉఛ్వాశ, నిశ్వాసల్లో ప్రతిక్షణం విహరిస్తూవుంటాను..!

నీ ప్రేమలో నా ఉనికే మిగలకపోయినా...

నీ కలల్లోనూ, కనుపాపల్లోనూ నేను కనిపిస్తూనే వుంటాను."

అతని కవితకు విచలితురాలైన ఆమె దూరమయ్యేదల్లా ఒక్కసారిగా అతనికి అల్లుకు పోయింది.

సరిగ్గా ఆక్షణంలో అక్కడికి ప్రవేశించాడు గుల్‌ఫాం ఫజల్ !!!

హఠాత్తుగా ఓ అపరిచితుడు అలా లోపలికి వచ్చేయడంతో ఉలిక్కిపడి సర్దుకుని నిల్చుంది మల్లీశ్వరి. వచ్చిన ఆగంతకుని సభ్యతలేని చూపుల్ని, వంకర నవ్వును భరించలేక వెంటనే అక్కడినుండి నిష్క్రమించింది.

గుల్‌ఫాం ఫజల్ వెకిలిగా నవ్వుతూ కుర్చీలో కూర్చుని తన సూట్‌కేసును బల్లపై వుంచి, దాన్ని తెరుస్తూ అతని వంక చూడకుండా అడిగాడు.

"సుభానల్లా !...ఎవర్రా ఆ దిల్‌కుష్? మతిపోగొట్టింది !"

"ఎవరైతే నీకెందుకు ? వచ్చిన పనేంటో చెప్పు"ఉబికి వస్తున్న ఆగ్రహాన్ని అణుచుకుని అడిగాడు అతను.

గుల్‌ఫాం ఫజల్ ముఖంలో క్షణంపాటు క్రోధం కనిపించి మాయమైంది. విరగబడి నవ్వుతూ ఛటుక్కున తన సూట్కేసునుండి రివాల్వర్ తీసి రెప్పపాటు క్షణంలో అతని మెడను తన మోచేతి తో బిగుతుగా బంధించి కుడిచేతి రివాల్వర్ని అతని కణతకు గురిపెట్టి ఉగ్రంగా ఊగిపోతూ అన్నాడతను.

"ఎంత ధైర్యంరా నీకు? నీకప్పగించిన పనిని నిర్లక్ష్యం చేసి ఇక్కడ అమ్మాయితో కులకుతావా ? విశ్వాశఘాతకుడా ! నిన్ను పవిత్ర యుద్ధానికి పంపిస్తే నువ్విక్కడ ప్రేమకలాపాలు సాగిస్తావా ? మా లక్ష్యాన్ని అపవిత్రం చేసిన నిన్ను..నిన్ను.. యిప్పుడే చంపి, నీ కప్పగించిన లక్ష్యాన్ని నేనే పూర్తి చేస్తా..."

గుల్‌ఫాం ఫజల్ మాటల్ని కట్ చేస్తూ అన్నాడతను కూల్ గా..

"గుల్‌ఫాం ఫజల్! ఒక్కసారి నీ కడుపు దగ్గరేముందో చూచుకో"

ఉలిక్కిపడ్డ గుల్‌ఫాం ఫజల్ తన పొట్ట వైపుకు చూచాడు. మరుక్షణం గుల్‌ఫాం ఫజల్ ముఖం తెల్లగా పాలిపోయింది. అక్కడ అమెరికన్ ఆటోమేటిక్ రివాల్వర్‌లోంచి బుల్లెట్లు దూసుకుపోవడానికి సిద్ధంగా వున్నాయన్నట్లుగా ట్రిగ్గర్ పై అతని వేలు కనిపించింది.

అతను చిరునవ్వుతో అన్నాడు..

renigunitauttam.blogspot.com

"గుల్ఫాం ఫజల్ ! తెలివి నీ ఒక్కడి సొమ్మేకాదు. ఇప్పుడు చెప్పు ! ట్రిగ్గర్ నువ్వు నొక్కతావా ? నన్ను నొక్కమంటావా ? నిముషం టైం యిస్తున్నా ! జవాబు రాకపోతే ఈ రివాల్వర్లోని గుళ్ళన్నీ నీ కడుపులోకి దూసుకుపోతాయ్ !"

గుల్ఫాం ఫజల్ కి కోలుకోవడానికి క్షణం పట్టింది. నోటమాటరాక అతని మెడ చుట్టూ బిగిసిన తన ఎడమచేతి పట్టును మెల్లగా సడలించాడు. ఆ క్షణాన్ని చాలా తెలివిగా నేర్పుగా వాడుకున్నాడతను. వెంటనే గుల్ఫాం ఫజల్ని విసిరికొట్టాడు. దాంతో దూరంగా వెళ్ళిపడ్డాడు.

మరుక్షణం గోడకేసి కొట్టిన బంతిలా చటుక్కున లేచి రివాల్వర్ని అతని వంక గురి పెట్టిన గుల్ఫాం ఫజల్కి తనకేసి గురిపెట్టిన రివాల్వర్తో సిద్ధంగా కనిపించాడతను.గుల్ఫాంఫజల్ అతని వంక క్రోధంగా చూచాడు. "నమ్మక్ హరామ్" అన్న పదం గుల్ఫాం ఫజల్ నోటి నుండి కసిగా వెలువడింది.

"అవును ! నేను నమ్మక్హరామ్ నే ! నీలాంటి ఉగ్రవాదుల్తో చేతులు కలిపి నా దేశానికి నేను నమ్మకద్రోహం చేయడానికి సిద్ధపడ్డాను. కాబట్టి నేను నమ్మక్హరామ్నే ! నీలాంటి నక్కల మాటలు నమ్మి, డబ్బుకాశపడి, ఉన్నఊరిని, కన్నతల్లిని వదలి, కనీసం ఎక్కడికి తీసుకెళుతున్నారని ప్రశ్నించకుండా గొర్రెల్లా నీలాంటి రాబందుల వెంటవచ్చి, పిరికి పందల్లా గెరిల్లా యుద్ధాన్ని నేర్చుకుని, నా దేశాన్ని వెన్నుపోటు పొడవాలనుకున్నాను కాబట్టి నేను నమ్మక్ హరామ్నే!"

"ఏంట్రా దేశం.. దేశం అని పెద్ద దేశభక్తుడిలా గొంతు చించుకుంటున్నావ్ ? ఈ దేశం నిన్ను సెకండ్క్లాస్ సిటిజన్లా చూస్తోంది. ఇక్కడి మెజారిటీలు మిమ్మల్ని ఆమడ దూరంలో వుంచుతున్నారు."

"నేను దేశభక్తుణ్ని కానురా... కానీ నువ్వంటున్నావే.. మమ్మల్ని ఆమడ దూరంలో వుంచుతున్నారని! దానికి కారణం ఎవరూ? నీలాంటి నీచులు పన్నిన ఉచ్చులో అమాయకంగా చిక్కి నిస్సహాయస్థితిలో మీ చేతిలో కీలుబొమ్మల్ల తయారయి, దారితప్పి మోసపోయిన కొందరు నాలాంటివాళ్ళ వల్లే ! కానీ, మీ కుతంత్రాలకు బలయిపోతోంది ఇక్కడి అమాయకపు జనాలే ! ఎవరో ఒకరు చేసిన తప్పుకి, శిక్ష మాత్రం ఆ వర్గమంతా అనుభవిస్తోంది. చివరికి,ఇరుగు-పొరుగు కూడా అనుమానపు చూపులతో చూస్తుంటే ప్రతి వ్యక్తి తాను నిజాయితీ పరుడనని, ప్రతిక్షణం తమ దేశభక్తిని నిరూపించుకునే దౌర్భాగ్యపు స్థితికి వాళ్ళని దిగజార్చేసారు కదరా !

స్వతంత్రం వచ్చాక సోదరప్రేమతో బ్రతకవలసిన మాదేశం ప్రజల మనోభావాలకు విరుద్ధంగా,కేవలం ఇద్దరు రాజకీయనాయకుల అహంవల్ల, అధికార కాంక్ష వల్ల ముక్క

reniguntauttam.blogspot.com

లైంది.  ఆ ముక్కల వల్ల మీకేకాదు మాక్కూడా గాయాలయ్యాయి.ఎప్పుడైనా మేమా గాయాలకు మందురాసి, మాన్పే ప్రయత్నం చేసిన ప్రతిసారి మీరు ఆ పాతగాయాలపై కారంచల్లి వెన్నుపోటు పొడిచి వాటిని వ్రణాల్లా చేస్తున్నారు.

నా కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయినప్పుడు మమ్మల్ని ఆదుకుంది హిందూ సోదరులే ! ఈ దేశంలో మా వర్గానికి చెందిన ఎందరో రాష్ట్రపతులయ్యారు. మంత్రులయ్యారు. గతంలో పెద్ద, పెద్ద పదవుల్లో, అధికారులుగా వుండేవారు.  ఇప్పుడు పరిస్థితిమారింది. దానికి కారణం ఎవరు ? నీలాంటి నికృష్టులు మా దేశంలో అల్లకల్లోలం సృష్టిస్తే అందుకు ఇక్కడ అభం,శుభం తెలియని సగటు జీవి శిక్ష అనుభవిస్తున్నాడు. గుల్ఫాం ఫజల్ ! నేను కూడా నీ చట్రంలోకి వచ్చేసేవాణ్ణే ! కానీ, ఈ అమ్మాయి కుటుంబం నా మీద చూపించిన ప్రేమ,అభిమానం,వాత్సల్యం నాలో నిద్రపోయిన విచక్షణను తట్టిలేపింది.  ఇక నీకథ ముగిసిపోయింది."

గుల్ఫాం ఫజల్ సెల్ చేతిలోకి తీసుకుని వెకిలిగా అన్నాడు.

"హా...హా..హా... రేయ్! నువ్వు నన్నేం చేయలేవు.  నీవాళ్ళందరూ మావాళ్ళ నిఘాలో వున్నారు. ఒక్క ఫోన్ చేసానంటే చాలు.. అందర్నీ చంపేస్తారు."

"గుల్ఫాం ! నావాళ్ళు అంటూ నాకిప్పుడు ఎవరూ లేరు.  అసలు నేనే ఓ జీవశ్చవాన్ని. ఎప్పుడైతే నేను మీ సాలెగూట్లో చిక్కుకున్నానో అప్పుడే మానసికంగా చచ్చిపోయాన్రా ! చావంటే నాకు భయంలేదు.దానికి భయపడుతోంది నువ్వే! అది నీ ముఖంలో తాండవిస్తోంది. కాబట్టి చావడానికి సిద్ధంగా వుండు" అన్నాడు అతను.

"రేయ్! నిన్ను చంపి, నాపని పూర్తిచేసుకుంటా !" అంటూ గుల్ఫాం ఫజల్ తన రివాల్వర్‌తో కాల్పులు మొదలు పెట్టాడు.

అతను కనురెప్పపాటులో తప్పించుకున్నాడు. కానీ, ఓ గుండు కొలిమిలో ఎర్రగా కాలిన చువ్వలా అతని భుజంలోకి దూసుకుపోయింది.అతను విసురుగా ఓ వైపుకు పడబోతూనిలదొక్కుకున్నాడు.

****

మేడపై జరుగుతున్న గందరగోళానికి మల్లీశ్వరి కుటుంబం భయపడిపోయి, అక్కడేం జరుగుతోందో చూడటానికి పరిగెట్టుకుంటూ వచ్చి, అతని గదిలోకి తొంగి చూచారు. అక్కడ కనిపించిన దృశ్యానికి వాళ్ళు నివ్వెరపోయారు.

అతని భుజం నుండి ధారాపాతంగా రక్తం కారుతోంది. నేలమీద వెల్లకిలా పడివున్న గుల్ఫాం ఫజల్ తలకు రివాల్వర్ని గురిపెట్టి నిలబడివున్నాడతను.

renigunta.blogspot.com

మల్లీశ్వరి కంగారుగా అతని గది లోపలికి వచ్చే ప్రయత్నం చేసింది. ఆమె తల్లితండ్రులు అడ్డుకున్నారు. ఆమె కళ్ళనీళ్ళ పర్యంతమై పోలీసులకు తెలియజేస్తానని అక్కడినుండి వెళ్ళిపోయింది.

గుల్‌ఫాం ఫజల్ ముఖంలో భయం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. “ రేయ్! ఏం చేయబోతున్నావ్ ?.. నన్ను పోలీసులకు పట్టిస్తావా ?”

“ఛఛ..! నీలాంటి తోడేళ్ళని పోలీసులకు పట్టిస్తే, మావాళ్ళు చాలా శాంతంగా, న్యాయబద్ధంగా, చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఈలోపున మీవాళ్ళు ఏ విమానాన్నో, మంత్రి పిల్లల్నో కిడ్నాప్ చేసి నిన్ను విడిపించుకెళతారు. ఒక్కసారి నువ్వు బయటపడితే నాలాంటి వాళ్ళని మళ్ళీ తయారుచేస్తావు. అందుకే నీకా అవకాశాన్ని యివ్వదలుచుకో లేదు.”

“మరేం చేయబోతున్నావ్?” గుల్‌ఫాం ఫజల్ భయంగా అడిగాడు.

“గుల్‌ఫాం! నీ ముఖం చూస్తుంటే నాకిప్పుడు ఎంతో తృప్తిగా వుందిరా! ఎంతమంది ప్రాణాలతో చెలగాట మాడావు. ఎంతమంది అమాయకుల్ని చంపేశావు ? ఇప్పుడు నీవంతు. నువ్వంటావే జీహాద్ అని... అందులో వీరమరణం పొందావనుకో!”

“నో ! నన్ను చంపకు..” భయంతో వణకిపోయాడు గుల్‌ఫాం ఫజల్. మరుక్షణం అతనిచేతిలోని రివాల్వర్లోంచి బుల్లెట్లు గుల్‌ఫాం ఫజల్ దేహాన్ని ఛిద్రం చేసాయి.

ఆ క్షణంలో అక్కడికి ప్రవేశించారు పోలీసులు.

అతన్ని అరెస్ట్‌చేసి తీసుకెళుతుండగా, కన్నీళ్ళతో నిల్చున్న మల్లీశ్వరితో చెప్పాడతను..

“నన్ను క్షమించు మల్లి ! మరుజన్మంటూ వుంటే నీకోసమే పుడతా!”

****

అతనికి బూట్ల చప్పుడు వినిపించింది.

మరికొన్ని క్షణాల్లో అతని సెల్లోకి జైలర్‌తో పాటు, ఓ డాక్టర్, మరో నలుగురు పోలీస్ కానిస్టేబుళ్లు ప్రవేశించారు.

డాక్టర్ అతన్ని పరిశీలించి ఆరోగ్యంగా వున్నట్లు సర్టిఫై చేసాడు.

ఆ తర్వాత అతనికి స్నానానికి ఏర్పాట్లు చేయించి, స్నానాదులయ్యాక, ఇష్టదైవాన్ని ప్రార్థించుకోమన్నారు. అతని ప్రార్థన ముగిసాక, తినడానికేమైనా కావాలా అని అడిగారు. వద్దని మంచినీళ్ళు మాత్రం కావాలని అడిగాడతను. ఓ గ్లాసుడు మంచినీళ్ళు తాగాడు.

సమయం నాలుగు గంటలైందనటానికి సూచనగా జైలుగంటలు మ్రోగాయి!

నలుగురి కానిస్టేబుళ్ళ మధ్య, డాక్టర్ సమక్షంలో, జైలర్ ముందు నడుస్తూవుండగా **అతను** ఉరికంబం వైపుకి అడుగులేశాడు

telugunitauttam.blogspot.com

reniguntauttam.blogspot.com

Renigunta Uttam

Writer-T.V.Artiste,

Ph: 040 -27128671
Cell: 99 66 370 592
e-mail : reniguntauttam@gmail.com
42-972/1/T-303,Vijaya Sagar, Jawahar Nagar,Moula Ali,Hyderabad-500 040

To
Sri Gajender Rao,
Editor,
Crime World,
Vijayawada.

Sir,

నమస్సులతో-

ఉగ్రవాద నేపథ్యంలో సాగే " **అతడు** " అనే కథను

ప్రచురణార్థం పంపుతున్నాను. ఇది కేవలం కల్పితం. ఎవరినీ ఉద్దేశించి వ్రాసింది కాదు.

దయతో పరిశీలించి, ప్రచురించి ప్రోత్సహిస్తారని ఆశిస్తాను.

ఈ కథ నా స్వంతం! దేనికి అనువాదం కానీ, అనుసరణ కానీ, కాపీ కాదని, ఇతర పత్రికలకు పరిశీలనార్థం పంపలేదని, వెబ్ సైట్లలోగానీ, వ్యక్తిగత బ్లాగుల్లోగానీ ప్రచురణ జరగలేదని హామీ యిస్తున్నాను.

భవదీయుడు,

( రేణిగుంట ఉత్తమ్ )

## విన్నపం

ఈ కథ, ఇందులోని పాత్రలు, సన్నివేశాలు, స్థలాలు, వగైరాలన్నీ కల్పితం. ఎవరినీ, ఏవర్గాన్నీ, నొప్పించాలని, వ్రాసినది కాదు. వార్తా పత్రికల్లో వచ్చిన కొన్ని కథనాల ఆధారంగా అల్లుకున్న కథే తప్ప ఈ కథ విషయంగా పబ్లిషర్స్‌కి గానీ. నాకు గానీ ఎటువంటి దురుద్దేశాలు లేవని భావించగలరని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

\- రేణిగుంట ఉత్తమ్.

reniguntauttam.blogspot.com